

సీఆర్పీ క్వార్టర్స్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు




ద్వారకానగర్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు

పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య

ఒంగోలు మెట్రో: గణపతి నవరాత్రి మహోత్సవాలు ఒంగోలులో వీధివిధినా వైభవంగా చేస్తున్నారు. నవ రాత్రి పందిళ్లు రంగురంగుల విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్నాయి. గణనాథుని మండపాల్లో గణపతి భక్త బృందాలు వరసిద్ధి వినాయక పూజలు నిర్వహిస్తున్నాయి. గురువారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో గణేశ్ భక్త మండలి, వివిధ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో లాయర్ పేట, గొడుగుపాలెం, గద్దలగుంట, రాజా పానగల్ రోడ్డు, మంగమూరు రోడ్డు నిర్మల్ నగర్, అయ్యప్ప నగర్, సంతపేట, రామ్‌నగర్, భాగ్యనగర్, కర్నూల్ రోడ్, సమతా నగర్, రాజీవ్ నగర్, మర్రిచెట్ల కాలనీ, గాంధీ రోడ్, దక్షిణం బజారు, గీతా మందిరం సెంటర్, పూలకొట్ల కూడలి, ఈమనిపాలెం, అంకమ్మపాలెం, నీలాయపాలెం, సంజీవ్ గాంధీనగర్, సీఆర్పీ క్వార్టర్స్, మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం తదితర చోట్ల వినాయకుని మండపాలలో భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. వినాయక చవితి మొదలు రోజూ ఉదయం సాయంత్రం పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్థానిక సమతా నగర్లోని ప్రత్యేక అలంకరణగా 1200 కొబ్బరి కాయలతో చేసిన వరసిద్ధి వినాయక స్వామి ప్రతిమకు స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఒంగోలు ఈమనిపాలెంలో కేదర్నాథ్ సెట్టింగ్తో మహాగణపతి ప్రత్యేక ఆకర్షణగా ద్వాదశ జ్యోతిర్లింగాలకు స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఒంగోలు దక్షిణం బజార్లోని 33 అడుగుల ఎత్తు మట్టితో చేసిన వరసిద్ధి వినాయకుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు.



రాజాపానగల రోడ్డులో వద్ద వరసిద్ధి వినాయక స్వామి పూజలో భక్తులు



మర్రిచెట్టు కాలనీ వరసిద్ధి వినాయక స్వామి నిమజ్జనంలో చిన్నారులు



సీతారాంపురం వరసిద్ధి వినాయక సన్నిధిలో ముగ్గుల పోటీల్లో మహిళలు

ముగ్గుల పోటీలు

నగర పాలక సంస్థ పరిధిలోని 27, 30 డివిజన్లో సీతారాంపురం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ గురువారం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు రంగవల్లులు దిద్ది గణపతి ఉత్సవాలు స్వర్ణమయం చేశారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









వినాయక నిమజ్జనం సందర్భంగా కొత్తపట్నం సముద్ర తీరంలో గురువారం భక్తుల సందడి

వరిలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన అవసరం

- దర్శి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ రమేష్‌బాబు



రైతులతో మాట్లాడుతున్న దర్శి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ రమేష్‌బాబు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తూ వరి పంట పండించి అత్యధిక దిగుబడులు సాధించుకోవడానికి అనువైన విధానాల గురించి దర్శి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ రమేష్‌బాబు గురువారం రైతులకు వివరించారు. నాగులుప్పలపాడు మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామంలో కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో వరి పంట సాగుచేసే రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రమేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు. రైతులకు వివిధ రకాల వరి వంగడాల గురించి వివరిస్తూ అత్యధిక దిగుబడి సాధించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ముందుగా జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామ్మోహనరావు మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించుకుని సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా వరిపంటలో పురుగులు, తెగుళ్లను తప్పించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఒంగోలు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట ద్వారా తాము వేసిన పంటలను నమోదు చేయించుకోవాలని కోరారు. నాగులుప్పలపాడు వ్యవసాయశాఖ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్ఎల్ఆర్ 33892 రకం విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజారాణి, శేషమ్మ, కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర కృష్ణారావు, కార్యదర్శి నడిపినేని శేషగిరిరావు, ఎత్తిపోతల పథకం పరిధిలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆదిలక్ష్మి, పక్కన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, విద్యార్థులు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): విద్యార్థులు గ్రంథాలయాలలో సభ్యత్వం తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సూచించారు. గురువారం నాగులుప్పలపాడు శాఖా గ్రంథాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె ముచ్చటిస్తూ విద్యార్థులకు విజ్ఞానం కల్పించే పలు పుస్తకాలు శాఖా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒంగోలుకు చెందిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య ప్రభుత్వ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం ఇప్పించారు. విద్యార్థులకు రూ.50, పెద్దలకు రూ.100 సభ్యత్వ రుసుం ఉంటుందని లైబ్రేరియన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఎస్.అంజిరెడ్డి, తెలుగు ఉపాధ్యాయురాలు మోహనలక్ష్మి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును పునఃపరిశీలించాలి

ఒంగోలు: ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మాల ఉద్యోగుల సదస్సు కరపత్రాన్ని వెలుగు ఉద్యోగుల సంఘం నాయకుడు గోపి అధ్యక్షతన చప్పిడి వెంగళరావు, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రద్దు చేసే వరకు మాల ఉద్యోగులు కీలక పాత్ర పోషించి ఉద్యమాన్ని అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలతో ముందుకు సాగించేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 14వ తేదీన మాల ఉద్యోగులు తలపెట్టిన సదస్సు, దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 22న హలో మాల ఛలో ఒంగోలు సభను జయప్రదం చేయాలని కోరారు. మాలమహానభ రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఉద్యోగుల సంఘ నాయకులు ఆనందరావు, సీనియర్ న్యాయవాది బాబూరావు, బండారు రామారావు కళామండలి అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు శాంతారావు, ఉద్యోగ నాయకులు పంది డేవిడ్, వివేకానంద్, దళిత నాయకులు మేడిద రవి, శ్రీహరి, వెంకట్ పాల్గొన్నారు.

మూసీ నదికి సాగర్ నీరు ఇవ్వాలి



సాగర్ కాలువ ఎస్కేప్ చానల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

చీమకుర్తి: మూసీ నదికి సాగర్‌నీరు ఇవ్వాలని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జే జయంతిబాబు, పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక రైతులతో కలిసి తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం వద్ద సాగర్ కాలువ ఎస్కేప్ చానల్‌ను గురువారం పరిశీలించారు. మూసీ నదిలో నీటి ప్రవాహం లేక దాని పరివాహక ప్రాంతంలో పంటలతో పాటు గొర్రెలు, మేకలకు కూడా నీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రామతీర్థం రిజర్వాయర్‌కు ఇస్తున్న నీటితో కూడా రిజర్వాయర్‌ను పూర్తిగా నింపలేదన్నారు. రిజర్వాయర్‌ను పూర్తిగా నింపి దాని పరిధిలో ఉన్న నోటిఫైడ్, నాన్‌నోటిఫైడ్ చెరువులు నింపాలన్నారు. సాగర్ కాలువ నుంచి వెలుగువారిపాలెం వద్ద మూసీ నదిలో కలిసే ఎస్కేప్ చానల్ ద్వారా సాగర్ నీటిని విడుదల చేయాలన్నారు. తద్వారా మూసీ నది పరిధిలో ఉన్న రైతులు, పశుపోషకులకు ప్రస్తుతం ఉన్న కరువు పరిస్థితుల నుంచి ఉపశమనం లభిస్తుందని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు చెక్కు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఒంగోలు అర్బన్: వరద బాధితులకు సాయం అందించేందుక సీఎం రిలీఫ్ ఫండ్‌కు లయన్స్ క్లబ్ సభ్యులు మంగళగిరి నరసింహారావు, షేక్ మహబూబ్‌లు కలిసి రూ.లక్ష అందజేశారు. ఆ మేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఆర్థిక సాయం తాలూకు డీడీని అందజేశారు.

వరద బాధితులకు రూ.5 లక్షల సాయం

ఒంగోలు సబర్బన్: విజయవాడ వరద బాధితులకు ఒంగోలు రంగా కిసాన్ సంస్థ ఒంగోలు భాగ్యనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా హోటల్ మౌర్యాలో గురువారం ఆయా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు హాజరయ్యారు. ఆ రెండు సంస్థలకు చెందిన నిర్వాహకులు ఎమ్మెల్యేకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. రంగా కిసాన్ సంస్థ అధ్యక్షుడు ఆలా వెంకటేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు

క్లుప్తంగా

గణేశ్ లడ్డూ రూ.37 వేలు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): నాగులుప్పలపాడులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం చేతిలో ఉంచి పూజలందుకున్న లడ్డూకు గురువారం వేలం వేశారు. గ్రామానికి చెందిన షేక్ నాగరాజు, రంజాన్‌బీ దంపతులు రూ.37 వేలకు పాడుకుని లడ్డూను కైవసం చేసుకున్నట్లు బాల గణేష్ యూత్ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు:మద్దిపాడు ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం1.45 గంటలకు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 24న జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం అప్పట్లో అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు అందిస్తున్న ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు సెంట్రల్: జూనియర్ చాంబర్ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు అందించారు. జేసీఐ అధ్యక్షుడు కె.వరుణ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. బ్రిలియంట్ కంప్యూటర్ చైర్మన్ న్యామతుల్లా ముఖ్య అతిథిగా హాజరై 14 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. జేసీఐ వారోత్సవాల చైర్మన్ శబరి నాయక్, కార్యదర్శి సాత్విక్, చైర్మన్ గంధబాల కృష్ణ పాల్గొన్నారు.

గణపతి పూజలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి



వినాయకుడికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి:జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చీమకుర్తిలో రెడ్డియూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి గురువారం పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ స్థానిక కౌన్సిలర్ బడే పద్మ అయ్యపరెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

రూ.45 వేలు పలికిన వినాయకుడి లడ్డూ...

చీమకుర్తిలోని ఎంఎన్ఆర్ అపార్టుమెంట్‌లో స్థానిక భక్తులు ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పూజలందుకున్న లడ్డూను స్థానిక భక్తుడు చింతల వెంకటేశ్వరరావు రూ.45 వేలకు వేలం పాటలో దక్కించుకున్నాడు. లడ్డూను వేడుకగా ఇంటికి తీసుకెళ్లాడు.



వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న వెంకటేశ్వరరావు

రసాయన ఎరువులు అవసరమైన మేరకే వాడుకోవాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

అల్లూరు (కొత్తపట్నం): వ్యవసాయానికి రసాయన ఎరువులు అవసరమైన మేరకే వాడుకోవాలని, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకుంటే వరి పంటలో పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామ్మోహన్‌రావు అన్నారు. అల్లూరులో వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు ఆధ్వర్యంలో వరి, శనగ, మినుము పండించే రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు తగినన్ని మోతాదులో ఎరువులు వాడుకుంటే భూమి లైఫ్ ఎక్కువగా ఉంటుందన్నారు. రసాయన ఎరువులను పూర్తి స్థాయిలో తగ్గించుకోవాలని సూచించారు. వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంలో చేయాలని తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం దర్శి కో ఆర్డినేటర్ రమేష్‌బాబు మాట్లాడుతూ అల్లూరు చెరువు, మెట్ట వరి సాగుకు అనువైన వరి రకాలను తెలియజేశారు. వరి పంటలో ఎరువులు యాజమాన్యంలో భాగంగా పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వాడుకోవాలన్నారు. తెగుళ్లు, కలుపు యాజమాన్యం గురించి వెల్లడించారు. ముఖ్యంగా ఎన్ఎల్ఆర్ 3354, ఎన్ఎల్ 34449, ఎన్‌డిఎల్ఆర్ 7,8 మొదలగు వరి రకాల అనుకూలంగా ఉంటాయన్నారు. అగ్గి తెగులు, దోమపోటు తట్టుకుంటాయని ఎన్ఎల్ఆర్ 3828 రకం చౌడును తట్టుకునే శక్తి ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు శైలజారాణి, శేషమ్మ, కొత్తపట్నం ఏవో మోహన్‌రెడ్డి, వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ప్రావీణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు వివరిస్తున్న డేటా ఎనలిస్ట్

ఒంగోలు సెంట్రల్: టెక్నాలజీలో ప్రావీణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీసీఎస్ డేటా ఎనలిస్ట్ గంజి నాగరాజు అన్నారు. పేస్ కళాశాలలో గురువారం తృతీయ, ఫైనలియర్ విద్యార్థులకు మెకానికల్ డ్రీమ్స్ టు సాఫ్ట్‌వేర్ డ్రీమ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి, టీసీఎస్ డెటా ఎనలిస్ట్ గంజి నాగరాజు టెక్నాలజీలో మారుతున్న వైనాన్ని.. తాను కళాశాలలో నేర్చుకున్న సబ్జెక్టు తర్వాత టెక్నాలజీలో పట్టు సాధించిన విధానాన్ని వివరించారు. ఐటీ రంగానికి, కోర్ రంగాలకు ఉన్న ప్రాధాన్యం తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ రూపా అక్కేష్, మెకానికల్ విభాగపు అధిపతి డాక్టర్ జి.కొండయ్య పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బంది కలగకూడదనే..

ఒంగోలు టౌన్: జీజీహెచ్ క్యాజువాలిటీలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నజ్మా నెలల పాపైన తన బిడ్డకు పాలివ్వడానికి వెళ్లారని, అదే క్యాజువాలిటీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బాషా ఆ సమయంలో రోగులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో కొద్దిసేపు విధులు నిర్వహించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి వివరణ ఇచ్చారు. గురువారం భార్యకు బదులు భర్త విధులు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆమె వివరణ ఇచ్చారు. క్యాజువాలిటీలో మెడికల్ ఆఫీసర్లుగా డాక్టర్ నజ్మా, డాక్టర్ బాషాలు విధులు నిర్వర్తిస్తున్నారని, ఈ విషయంలో వారి నుంచి వివరణ తీసుకున్నట్లు పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితిలో జరిగిన సర్దుబాటు తప్ప ఇందులో మరే ఉద్దేశం లేదని ఆమె వివరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఎంఈఓకు డీడీ అందజేస్తున్న ఇన్‌చార్జి, హెచ్‌ఎం, విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: వరద బాధితులకు సహాయార్థం ఒంగోలు సెయింట్ జేవీయర్స్ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది రూ.1.10 లక్షల డీడీని గురువారం ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబుకు అందజేశారు. ఈ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపాలని కోరారు. సెయింట్ జేవీయర్స్ ఇన్‌చార్జి కేఎం జయషీలా, హెచ్‌ఎం నక్షత్రం పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మృతి



గుంజి అచ్యుత్ (ఫైల్)

ఒంగోలు టౌన్: ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు, గాయకుడు గుంజి అచ్యుత్ బుధవారం రాత్రి మరణించారు. నగరంలోని గోపాల్ నగర్‌లో నివశించే ఆయన బాపట్ల జిల్లా అద్దంకి మండలం కుంకుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వాహణలో స్కూలుకు వెళ్తుండగా మోటారు బైకు అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అచ్యుత్‌ను ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స చేస్తున్నారు. పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బుధవారం విజయవాడ తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించింది. దీంతో వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అచ్యుత్‌కు మంచి గాయకుడిగా పేరుంది. కళాకారుల సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తుంటారు. అచ్యుత్ మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే పలువురు కవులు, కళాకారులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మొక్కల పెంపకం జీవకోటికి మేలు



మొక్కలు నాటుతున్న సీడీసీ డీన్ సోమశేఖర్, ఇతర ప్రొఫెసర్లు

ఒంగోలు సెంట్రల్: మొక్కల జీవ కోటికి ప్రాణ వాయువును అందిస్తాయని, చెట్ల పెంచటం ద్వారా జీవనోపాధులకు ఎంతో మేలు జరుగుతుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సీడీసీ డీన్ డాక్టర్ సోమశేఖర్ అన్నారు. ఏకే యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సోషల్ వర్క్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పిల్లి వెంకటరావు, ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి శిద్దా నివాళి

ఒంగోలు సెంట్రల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, సామాజిక శాస్త్రవేత్త సీతారాం ఏచూరి మరణం బాధకరమని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తూ ఉన్నత విద్యావంతునిగా తెలుగు రాష్ట్రం నుంచి భారత కమ్యూనిస్ట్ పార్టీలో ఉన్నత బాధ్యతలు చేపట్టి కమ్యూనిస్ట్ భావజాలాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన సేవలు మరువలేని వన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.